# భారత్‌లోని విదేశీయులకు నెల పాటు ఉచితంగా వీసా, ఈ-వీసా పొడిగింపు

## ఓవర్‌స్టే జరిమానా మాఫీ

**టి మీడియా, మార్చి14, ఢిల్లీ బ్యూరో:**
పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా విమాన ప్రయాణాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. గల్ఫ్ ప్రాంతంలో కొన్ని గగనతల మార్గాలు మూసివేయడం, విమానాల రద్దు వంటి పరిణామాల వల్ల అనేక మంది విదేశీయులు భారత్‌లోనే ఇరుక్కుపోయిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో చిక్కుకుపోయిన విదేశీయులకు వీసా పొడిగింపు ఇవ్వడంతో పాటు ఓవర్‌స్టే జరిమానాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. దుబాయ్‌లోని భారత కాన్సులేట్ జనరల్ ఆ విషయాన్ని ఎక్స్ ద్వారా వెల్లడించింది. పశ్చిమాసియాలో జరుగుతున్న పరిణామాల కారణంగా ప్రయాణాలకు అంతరాయం ఏర్పడడంతో భారత్‌ను విడిచి వెళ్లలేని విదేశీయులకు ఉపశమనం కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.


Consulate General of India
Dubai

Extension of Regular Indian Visa/E-Visa and waiver of over stay penalty to foreigners stuck in India due to the ongoing developments in West Asia.

Taking into account the conflict situation in Gulf region, the following has been decided:

• All types of Visas/ e-Visas expiring/due for expiry soon would be extended for a month on gratis basis, for the affected nationals by jurisdictional FRROs on case-to-case basis;

• Penalty for any overstay by affected foreign nationals due to ongoing developments in West Asia after February 28, 2026 would be waived off;

• Exit Permits to the affected foreign nationals would be provided on gratis basis;

• Non-application of Exit Permit and Extension of Visas by affected foreign nationals would not be treated as violation of migration legislation; and

• Temporary Landing Permit (TLP) would be granted to a foreign national arriving in India due to diversion of flights on gratis basis.

Date:13 March 2026
Place:Dubai




**సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం**
ప్రకటన ప్రకారం, ప్రస్తుతం గడువు ముగియబోతున్న లేదా త్వరలో ముగియనున్న అన్ని రకాల భారత వీసాలు, ఈ-వీసాలను ఒక నెలపాటు ఉచితంగా పొడిగిస్తారు. ఆ పొడిగింపును సంబంధిత ప్రాంతాల ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీసులు కేసు వారీగా పరిశీలించి మంజూరు చేస్తాయి. విమాన మార్గాలు సవ్యంగా పునరుద్ధరించే వరకు విదేశీయులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

**ఓవర్‌స్టే జరిమానాలు పూర్తిగా మాఫీ**
అలాగే, పశ్చిమాసియా ప్రాంతంలో జరుగుతున్న పరిణామాల కారణంగా భారత్‌లో ఉండిపోయిన విదేశీయులకు మరో పెద్ద ఉపశమనం కల్పించారు. 2026 ఫిబ్రవరి 28 తర్వాత వీసా గడువు ముగిసి భారత్‌లో కొనసాగినప్పటికీ, ఆ కారణంగా విధించే ఓవర్‌స్టే జరిమానాలను పూర్తిగా మాఫీ చేయాలని నిర్ణయించారు. సాధారణంగా వీసా గడువు ముగిసిన తర్వాత దేశంలో కొనసాగితే జరిమానాలు లేదా చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుత పరిస్థితులు అసాధారణమైనవిగా భావించి సడలింపులు ఇచ్చారు. అదే సమయంలో ఇలాంటి పరిస్థితుల్లో భారత్‌ను విడిచి వెళ్లేందుకు అవసరమైన ఎగ్జిట్ పర్మిట్లను కూడా ఉచితంగా ఇవ్వనున్నారు. విమాన సర్వీసులు తిరిగి ప్రారంభమైన తర్వాత తమ దేశాలకు వెళ్లాలనుకునే విదేశీయులు ఈ పర్మిట్లను ఉపయోగించుకోవచ్చు. సాధారణ పరిస్థితుల్లో ఎగ్జిట్ పర్మిట్‌కు ఫీజులు ఉండే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వాటిని కూడా మాఫీ చేశారు. విమానాశ్రయాల్లో అనవసరమైన ఇబ్బందులు ఎదుర్కోకుండా!మరొక ముఖ్య నిర్ణయం కూడా కేంద్ర ప్రభుత్వం తీసుకుంది. పశ్చిమాసియా గగనతలంలో ఏర్పడిన అంతరాయాల కారణంగా కొన్ని అంతర్జాతీయ విమానాలు మార్గం మళ్లుతున్నాయి. అటువంటి సందర్భాల్లో భారత్‌లో దిగాల్సి వచ్చే విదేశీయులకు తాత్కాలిక ల్యాండింగ్ పర్మిట్లు కూడా ఉచితంగా ఇవ్వనున్నారు. దీనివల్ల ప్రయాణికులు విమానాశ్రయాల్లో అనవసరమైన ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉంటారు. అధికారులు మరో ముఖ్యమైన విషయాన్ని కూడా స్పష్టం చేశారు. ఈ సమయంలో వీసా పొడిగింపు లేదా ఎగ్జిట్ పర్మిట్ కోసం వెంటనే దరఖాస్తు చేయకపోయినా దాన్ని వలస చట్టాల ఉల్లంఘనగా పరిగణించబోమని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ సడలింపులు ఇచ్చినట్లు వెల్లడించారు. పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ విమానయాన రంగం కూడా తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కొంటోంది. కొన్ని దేశాల గగనతల మార్గాలు తాత్కాలికంగా మూసివేయడం, విమానాల మార్గాలను మార్చడం వంటి చర్యల వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. భారత్‌కు వచ్చిన అనేక మంది విదేశీయులు కూడా ఈ కారణంగా తమ దేశాలకు తిరిగి వెళ్లలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం విదేశీ ప్రయాణికులకు పెద్ద ఉపశమనం కలిగించనుంది. వీసా పొడిగింపు, జరిమానా మాఫీ, ఉచిత ఎగ్జిట్ పర్మిట్లు, తాత్కాలిక ల్యాండింగ్ పర్మిట్లు వంటి చర్యలు ప్రస్తుతం ఇరుక్కుపోయిన ప్రయాణికులకు కొంత ఊరటనివ్వనున్నాయి. విమాన మార్గాలు సాధారణ స్థితికి చేరుకున్న తర్వాత విదేశీయులు తమ దేశాలకు తిరిగి వెళ్లేందుకు ఈ చర్యలు సహాయపడతాయని అధికారులు తెలిపారు.

# ఓవైపు ఇంట్లో నాన్న శవం.. మరోవైపు..

**టి మీడియా, మార్చి14,మోత్కూర్:**
యాదాద్రి జిల్లా మోత్కూర్‌కు చెందిన కూరేళ్ల ఎల్లయ్య.. గుండాల మండలం వస్తాకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఎల్లయ్యకు ఇద్దరు కొడుకులు, కుమార్తె ఉన్నారు. కూతురు ఇంటర్మీడియట్ చదువుతుండగా, పెద్దకొడుకు టెన్త్ క్లాస్, చిన్న కొడుకు ఎనిమిదవ తరగతి చదువుతున్నారు. పిల్లలను బాగా చదివించి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలనేది ఎల్లయ్య ఆశయం. టెన్షన్ లేకుండా పదవ తరగతి పరీక్షలు రాసేందుకు కొడుకు హర్షవర్ధన్‌కు తండ్రి ఎల్లయ్య సూచనలు చేశాడు. రాత్రి పడుకునే సమయంలో ఎల్లయ్యకు ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. దీంతో స్థానికంగా వైద్యులు చికిత్స చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో ఎల్లయ్య గుండెపోటుతో విగత జీవిగా మారిపోయాడు. రాత్రి నుంచి ఏడుపులతో ఆ ఇంట విషాదం నెలకుంది. తెల్లవారితే పదవ తరగతి పరీక్షలు.. రాత్రంతా హర్షవర్ధన్‌కు నిద్రలేని రాత్రిగా మారింది. ఒకవైపు కళ్లముందే విగతజీవిగా పడి ఉన్న కన్నతండ్రి.. మరోవైపు తన భవిష్యత్తును నిర్ణయించే పదవ తరగతి పరీక్షలు. ఈ రెండింటి మధ్య నలిగిపోయిన ఆ విద్యార్థి వేదన వర్ణనాతీతం. తండ్రి మరణంతో ఉబికి వస్తున్న కన్నీళ్లను ఆపుకొంటూ.. బాధను దిగమింగుకొని పుట్టెడు దుఃఖంతో విద్యార్థి హర్షవర్ధన్ పదోతరగతి పరీక్షకు హాజరయ్యాడు. పరీక్షా హాల్లో ప్రశ్నపత్రం ముందు ఉన్నా, అతడి మనసంతా నాన్న జ్ఞాపకాలతోనే నిండిపోయింది. కన్నీటి పర్యంతమవుతూనే పరీక్ష రాస్తున్న ఆ బాలుడిని చూసి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు సైతం చలించిపోయారు. తండ్రికి ఇచ్చే నిజమైన నివాళి ఆయన ఆశయాన్ని నెరవేర్చడమేనని నిరూపించిన హర్షవర్ధన్ ధైర్యం అందరినీ ఓ పాఠంగా నిలిచింది. తెలుగు పరీక్ష అనంతరం హర్షవర్ధన్ తండ్రికి అంత్యక్రియలు నిర్వహించాడు. ప్రాణప్రదమైన తండ్రి మరణం వంటి బాధను ఎదుర్కొని అతడు రాసిన ఈ పరీక్ష, కేవలం మార్కుల కోసం కాదు.. ఒక తండ్రి కల కోసం అని, ఆ విద్యార్థికి భగవంతుడు ధైర్యాన్నివ్వాలని అందరూ కోరుకున్నారు.



## ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్స్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

**టీ మీడియా, మార్చి 14, వనపర్తి బ్యూరో :**
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వనపర్తి ఎన్ ఎస్ ఎస్ సెల్ ఆధ్వర్యంలో పెద్దగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపులో భాగంగా మూడవరోజు శనివారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పోతురాజు శ్రీనివాస్, డాక్టర్ జి సుష్మ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ఆధ్వర్యంలో హైస్కూల్, ప్రైమరీ స్కూలు పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలను తొలగిస్తూ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. అలాగే ఈ కార్యక్రమంలో పెద్దగూడెం ఫారెస్ట్ స్టేషన్ ఆఫీసర్ పి. రాణి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎంఏ మక్బుల్ అహమ్మద్ వారు కూడా పాల్గొని అటవీ పరిరక్షణ - మొక్కల ప్రాధాన్యత అనే అంశాలపై విద్యార్థులతో చర్చించడం జరిగింది. ఫారెస్ట్ స్టేషన్ ఆఫీసర్ పి రాణి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే సేవాగుణంతో పాటు ప్రకృతిపై అవగాహన. పెంచుకోవాలి అని,మానవ మనుగడకు సకల చరాచర జీవులకు ప్రకృతి పరిరక్షణ ఎంతో అవసరమని చెబుతూ విద్యార్థులలో ఉత్సాహాన్ని పెంపొందించారు. భోజనం చేసిన తర్వాత పలు సామాజిక అంశాలపై వాలంటీర్స్ తో ప్రోగ్రాం ఆఫీసర్స్ చర్చించడం జరిగింది.



## శీనన్నకు జనం కన్నీటి వీడ్కోలు

- పాడేమోసిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**టీ మీడియా, మార్చి 14, వనపర్తి బ్యూరో :**
అమ్మపల్లి. శ్రీనివాస్ రెడ్డి మృతితో అభిమానులు,స్నేహితులు, శ్రేయోభిలాషులు దుఃఖ సాగరములో మునిగిపోయారు.ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు తపన పడిన తమ అభిమాన నాయకుణ్ణికి కడసారి వీడ్కోలు పలకడానికి అశేషంగా తరలివచ్చిన వారితో అమ్మపల్లి జనసంద్రం అయ్యింది. భావోద్వేగానికి గురైన మాజీ మంత్రి. పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తూ కన్నీటిపర్యంతమై తీవ్ర భావోద్వేగానికి గురైనారు. శ్రీనివాస్ రెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించి పాడే మోసి కడసారి వీడ్కోలు పలికారు. శ్రీనివాస్ రెడ్డి మృతి వ్యక్తిగతంగా తనకు, ప్రజలకు, పార్టీకి తీరని లోటని భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి కలిగించి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించాలని ఆకాంక్షించారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే అల. వెంకటేశ్వర రెడ్డి,గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్ నందిమల్ల అశోక్,జగదీశ్వర్ రెడ్డి, లక్ష్మా రెడ్డి,రఘుపతి రెడ్డి, రాజమహేంద్ర రెడ్డి, వేణు యాదవ్, బాలేశ్వేర్ రెడ్డి,కుమార్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, సేనాపతి, పురుషోత్తం రెడ్డి, చిట్యాల.రాము తదితరులు ఉన్నారు.



## ప్రజల గుండెల్లో నిలిచిన ఉత్తమ అధికారులు

**టీ మీడియా, మార్చి 14, వనపర్తి బ్యూరో :**
ఉత్తమ అధికారులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన వనపర్తికి చెందిన రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ లో జాయింట్ డైరెక్టర్ పనిచేసిన జన్ను వెంకటరమణను శనివారం సాహితీ కళా వేదిక ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఉత్తమ అధికారిగా 37 సంవత్సరాల పాటు పనిచేసిన వెంకటరమణ ఎక్కడ ఎలాంటి ఆరోపణలు లేకుండా అధికారుల ప్రజాప్రతిధుల ప్రశంసలను అందుకున్నారని కొనియాడారు. ఆయన ఉద్యోగ జీవితం పలువురికి స్ఫూర్తివంతమని పేర్కొన్నారు. ఈనాటి కార్యక్రమంలో కళావేదిక ప్రతినిధులు బైరోజు చంద్ర శేఖర్, బండారు శ్రీనివాస్, ఆర్డీఎస్ సంస్థ నిర్వాహకురాలు చిన్నమ్మ థామస్,గంధం నాగరాజు , గ్రామ భారతి నిర్వాహకుడు కరుణాకర్ గౌడ్, శ్రీలక్ష్మి, అరుణ, మింటూ ,కల్పన, ముబీన, దివ్య భారతి తదితరులు పాల్గొన్నారు.



## గంగమ్మ తల్లికి పూజలు చేసిన ఎమ్మెల్యే

**టీ మీడియా,మార్చి 14, పెబ్బేరు:**
శనివారం పెబ్బేరు పట్టణంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయంలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం చేపట్టిన సందర్భంగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు ఆలయ నిర్మాణానికి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదుని రెడ్డి ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి పెబ్బేరు మున్సిపల్ కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లసర్పంచులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఇంట్లో తండ్రి మృతదేహం..

- పదో తరగతి పరీక్షకు విద్యార్థి..!

**టి మీడియా, మార్చి14, శివ్వంపేట :**
తెల్లవారితే కొడుకుకు పదో తరగతి పరీక్షలు మొదలు..! పనిమీద బయటికి వెళ్లిన తండ్రి ఇంటికి వస్తూ రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి..! అప్పటిదాకా సంతోషంగా ఉన్న ఆ కుటుంబంలో ఒక్కసారిగా తీవ్ర విషాదం..! తండ్రి మృతదేహం దగ్గర ఏడుస్తూ కూర్చున్న కొడుకు.. కుటుంబసభ్యులు, బంధువుల ప్రోత్సాహంతో పరీక్ష రాయాలని నిర్ణయించుకున్నాడు. దుఃఖాన్ని దిగమింగుతూ అతడు పరీక్ష రాసేందుకు వెళ్లాడు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో ఈ హృదయవిధారక ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. శివ్వంపేట మండలంలోని పాంబండ గ్రామానికి చెందిన కుమ్మరి నాగరాజు (45) శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తెల్లవారితే కొడుకు ధనుష్ పదవ తరగతి పరీక్షలు రాయాల్సి ఉంది. తండ్రి మృతితో కుటుంబసభ్యులు తీవ్ర శోకంలో మునిగిపోయారు. ఈ విషాద సమయంలో కూడా ధనుష్.. తన కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తుల ప్రోత్సాహంతో ఆలోచించి తన భవిష్యత్తు కోసం పరీక్ష రాయాలని నిర్ణయించుకున్నాడు. తూప్రాన్‌లోని పరీక్షా కేంద్రానికి వెళ్లి పరీక్ష రాశాడు. కొడుకు ధనుష్ పరీక్ష రాసి వచ్చిన అనంతరం పాంబండ గ్రామంలో తండ్రి నాగరాజు అంత్యక్రియల ప్రక్రియను మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు విద్యార్థి ధనుష్‌ను అభినందించారు. జీవితంలో ఎంతటి కష్టాలు ఎదురైనా చదువుకుని సాధించాలనే పట్టుదల ఉంటే విజయం దక్కుతుందని అన్నారు. తండ్రిని కోల్పోయిన దుఃఖంలో కూడా ధనుష్ పరీక్ష రాసి రావడంతో పలువురు భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టారు.



# అమెరికాలో భారతీయుల అరెస్టు

- వీసా మోసానికి కుట్ర పన్నారనే ఆరోపణ

**టీ మీడియా,మార్చి 14, ఢిల్లీ బ్యూరో:**
వీసా మోసానికి కుట్ర పన్నారనే ఆరోపణలపై నాలుగు రాష్ట్రాలలో జరిపిన ఆపరేషన్లలో ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ 10 మంది భారతీయులను అరెస్టు చేసింది. నేర బాధితులుగా నటించి, ఇమ్మిగ్రేషన్ ప్రయోజనాలను పొందడానికి భారతీయ పౌరులు నకిలీ సాయుధ దోపిడీలను పాల్పడ్డారని ఎఫ్‌బీఐ ఆరోపించింది. ఈ కేసులో మొత్తం 11 మంది భారతీయులపై అభియోగాలు మోపారు. వారిలో పది మందిని అరెస్టు చేయగా, ఒకరిపై అభియోగం మోపి భారతదేశానికి తిప్పి పంపించారు. ఈ వ్యక్తులు అనేక దుకాణాలలో నకిలీ సాయుధ దోపిడీలకు పాల్పడ్డారని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఆరోపించింది. ఈ సంఘటనలను దుకాణ ఉద్యోగులు, యజమానులను బాధితులుగా చిత్రీకరించడానికి ఉపయోగించారు. తద్వారా వారు ఖ నాన్-ఇమ్మిగ్రెంట్ వీసా కోసం దరఖాస్తు చేసుకున్నారు. తీవ్రమైన నేరాలకు గురైన, దర్యాప్తులో చట్ట అమలు సంస్థలతో సహకరించే వ్యక్తులకు ఈ వీసా మంజూరు చేస్తారు. దీని నుండి ప్రయోజనం పొందడానికి భారతీయ పౌరులు ఈ కుట్రను పన్నారని భావిస్తున్నారు. దర్యాప్తు సంస్థ దానిని బయటపెట్టి వారిని పట్టుకుంది. నిందితులందరూ గుజరాత్ నివాసితులుగా గుర్తించారు. నిందితులు 2023లో ఈ కుట్రను ప్రారంభించారు. ఆ సమయంలో, మసాచుసెట్స్‌లోని కనీసం ఆరు కన్వీనియన్స్ స్టోర్లు, మద్యం దుకాణాలు, ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్లలో సాయుధ దోపిడీలు జరిగాయి. ప్రతిసారీ, అదే పద్ధతిని ఉపయోగించారని దర్యాప్తు సంస్థ తెలిపింది. ఒక వ్యక్తి ఉద్యోగులను ఆయుధంతో బెదిరించడం, నగదు రిజిస్టర్ నుండి డబ్బులు తీసుకుని పారిపోవడం. నిందితులు ఈ విధంగా పదే పదే ఈ సంఘటనలకు పాల్పడ్డారు. ఈ మొత్తం సంఘటన దుకాణంలోని జఙుఎ కెమెరాలలో రికార్డ్ అయ్యింది. ఆ తర్వాత, ఉద్యోగులు, యజమానులు పోలీసులకు తెలియజేసే ముందు కొన్ని నిమిషాలు వేచి ఉండి, నిందితులు సురక్షితంగా అక్కడి నుంచి వెళ్లిపోయేవారని ఎఫ్‌బీఐ తెలిపింది. ఈ సంఘటనలను ప్రధాన నిందితుడు రాంభాయ్ పటేల్, అతని సహచరులు ప్లాన్ చేశారని దర్యాప్తులో తేలింది. కుట్రలో పాల్గొనడానికి బాధితులు డబ్బు చెల్లించగా, పటేల్ తన దుకాణాలను ఉపయోగించుకున్నందుకు దుకాణదారులకు డబ్బు చెల్లించాడు. ఈ సంఘటనల ఉద్దేశ్యం ఉద్యోగులు, దుకాణాల యజమానులు హింసాత్మక నేరాలకు గురైనట్లు చూపించడం, తద్వారా వారు ఖ వీసాకు అర్హులు కావాలని భావించారు. ఈ కేసుకు సంబంధించి జితేంద్ర కుమార్ పటేల్, మహేష్ కుమార్ పటేల్, సంజయ్ కుమార్ పటేల్, అమిత బెన్ పటేల్, సంగీత బెన్ పటేల్, మితుల్ పటేల్‌లను మసాచుసెట్స్‌లో అరెస్టు చేసినట్లు దర్యాప్తు సంస్థ అధికారి తెలిపారు. బోస్టన్‌లోని కోర్టులో వారి హాజరు తర్వాత నిందితులను విడుదల చేశారు. ఇక, రమేష్ భాయ్ పటేల్, రోనక్ కుమార్ పటేల్, సోనాల్ పటేల్, మింకేష్ పటేల్‌లను కెంటుకీ, మిస్సోరి, ఒహియోలలో అరెస్టు చేసి, బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టులో హాజరుపరిచారు.




# గ్యాస్ సిలిండర్ల బోల్తా..

## తప్పిన పెను ప్రమాదం

**టీ మీడియా,మార్చి 14, కి షన్‌గఢ్:**
రాజస్థాన్ లోని కిషన్‌గఢ్‌లో తృటిలో పెను ప్రమాదం తప్పింది. జైపూర్--అజ్మేర్ నేషనల్ హైవే-48పై గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న లారీ అదుపు తప్పి పల్టీ కొట్టింది. కిషన్‌గఢ్ టోల్ సమీపంలోని చిడియా బావడి ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. స్థానికుల అప్రమత్తంతో భారీ ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. బర్నా గ్రామం నుండి కిషన్‌గఢ్ వైపు సిలిండర్లను తీసుకెళ్తున్న ట్రక్కు.. జాతీయ రహదారిపై అకస్మాత్తుగా, టైర్ పేలిపోవడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. అదుపు తప్పిన లారీ రోడ్డుపై పల్టీ కొట్టినట్లు సమాచారం. వాహనం పడిపోవడంతో అందులో ఉన్న గ్యాస్ సిలిండర్లు హైవేపై నలువైపులా చెల్లాచెదురుగా పడ్డాయి. అవి ఎక్కడ పేలుతాయోనని స్థానికులు, వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. అయితే ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులుఅ వెంటనే అతన్ని రక్షించి సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. కానీ అతను చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం జరిగిన వెంటనే హైవేపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే మదన్‌గంజ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదం తరువాత, హైవే అంతటా చెల్లాచెదురుగా ఉన్న సిలిండర్లను చూసి స్థానికులు భయపడ్డారు. కానీ వెంటనే పోలీసులకు తమ సహాయాన్ని అందించారు. చాలా మంది రోడ్డు పక్కన ఉన్న సురక్షితమైన ప్రదేశంలోకి సిలిండర్లను చేర్చి ట్రాఫిక్‌ను పునరుద్ధరించడంలో సహాయపడ్డారు. సిలిండర్లు ఏవీ లీక్ కాలేదని, పెద్ద విషాదాన్ని నివారించాయని పోలీసులు చెబుతున్నారు. స్థానికుల సహాయంతో రోడ్డుపై పడ్డ సిలిండర్లను మరో వాహనంలో లోడ్ చేసి అక్కడి నుంచి తరలించారు. భారీ ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



## భర్త మీద కోపంతో..
## పిల్లలతో కలిసి చెరువులో దూకేసిన మహిళ

**టీ మీడియా,మార్చి 14, కర్నూలు :**
అయ్యో పాపం పసిపిల్లలు.. భర్త మీద కోపంతో తన పిల్లలు భర్తకు కూడా దక్కరాదని మరణ శాసనం రాసింది ఓ తల్లి. ఇద్దరు కొడుకులతో కలిసి చెరువులోకి దూకింది తల్లి. నీట మునిగిన ముగ్గురు మృతి చెందారు. చెరువులో విగతజీవులుగా కనిపించిన వారిని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. భర్త ఎంతగా వేధింపులకు గురిచేసి ఉండకపోతే, ఇంతటి విషాదానికి కారణం అనే వాదన వినిపిస్తోంది. కర్నూలు సమీపంలోని గార్గేయపురంలో ఈ విషాదం చోటుచేసుకుంది. భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలతో తల్లి తన ఇద్దరు కుమారులతో కలిసి గార్గేయపురం చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం అలంపూర్ కి చెందిన రాజుతో గార్గేయపురానికి చెందిన రాజేశ్వరి(36) కొన్నాళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి అబ్రహం (6) సుకుమార్(3) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలం సంసారం సజావుగానే సాగింది. ఇటీవల భార్యాభర్తల గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే ఇటీవల భర్తతో ఘర్షణపడ్డ రాజేశ్వరి పుట్టిన ఊరు గార్గేయపురంలో కొన్ని రోజులుగా ఉంటుంది. ఏమైందో ఏమో గానీ శుక్రవారం (మార్చి 13) సాయంత్రం ఇద్దరు పిల్లలను తీసుకువెళ్లి చెరువులో దూకేసింది. శనివారం ఉదయం ముగ్గురు మృతదేహాలు బయట పడ్డాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం కోసం పంపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు



## ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి ఎంఎల్‌ఏ

**టీ మీడియా ,మార్చి 14 పెబ్బేరు :**
శనివారం పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన దేవరపల్లి శ్యామల భర్త శాంతయ్య నూతన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తూడి మేఘా రెడ్డి లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందించారు అనంతరం లబ్ధిదారులు ఎమ్మెల్యే మేఘారెడ్డి కి రేవంత్ రెడ్డి కి తెలంగాణ ప్రజా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ యస్ సి సెల్ రాష్ట్ర కన్వీనర్ గంధం రాజశేఖర్ జిల్లా యువజన నాయకులు గంధం రంజిత్ కుమార్ సాయి చరణ్ రెడ్డి కొంతశీ దయాకర్ రెడ్డి 1 వ వార్డు ఇంచార్జీ కొట్టిడీ వినయ్ కుమార్ వార్డు అధ్యక్షులు అడ్డాకుల రాజు పెబ్బేరు పట్టణ యువ నాయకులు గంధం ఉత్తమ్ కుమార్ ఎర్రశీ ఆదిత్య కాంగ్రెస్ మహిళ నాయకులు జానమ్మ పాల్గొన్నారు



## పదో తరగతి పరీక్షల్లో గందరగోళం..

- వాళ్ల స్కూల్‌లోనే పరీక్షా కేంద్రం

**టి మీడియా, మార్చి14, హైదరాబాద్ :**
పదో తరగతి పరీక్షల నిర్వహణలో విద్యా శాఖ అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. కూకట్‌పల్లిలోని న్యూ ఎరా స్కూల్‌లో చదువుతున్న 80 మంది విద్యార్థులకు అదే పాఠశాలలో ఎగ్జామ్ సెంటర్ కేటాయించారు. ఈ విషయం బయటకు రావడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా ఒక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అదే పాఠశాలలో పరీక్షా కేంద్రం ఇవ్వడం నిషేధం. కానీ ఈ నిబంధనను పట్టించుకోకుండా హైదరాబాద్ కూకట్‌పల్లిలోని న్యూఎరా పాఠశాలకు చెందిన విద్యార్థులకు అదే పాఠశాలలో ఎగ్జామ్ సెంటర్ కేటాయించారు. ఈ విషయం బయటకు పొక్కకుండా డీఈవో రహస్యంగా ఉంచారు. హాల్ టికెట్‌ను ఎవరికీ చూపించకూడదని ఆ 80 మంది విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం సూచించింది. కాగా, మార్కుల కోసమే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యా శాఖ అధికారులు కుమ్మక్కయ్యారని తల్లిదండ్రులు, విద్యా సంఘాలు ఆరోపిస్తున్నాయి. దీనివల్ల విద్యార్థులకు అన్యాయం జరుగుతుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు.




## పటాన్‌చెరులో వాచ్‌మెన్ దంపతుల దారుణ హత్య

**టి మీడియా, మార్చి14, పటాన్‌చెరు:**
హైదరాబాద్ శివారు పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని సిటిజెన్ కాలనీ సమీపంలో నిర్మాణంలో ఉన్న భవన వాచ్‌మెన్ దంపతులను కొందరు దుండగులు దారుణంగా హత్య చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గురుడు మండలం దొంగచింత తండాకు చెందిన దంపతులు సోమ్లా దశరథ్ (50), మాన్యమ్మ (45) కొంతకాలం కింద జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని సిటిజెన్ కాలనీ సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనానికి వాచ్‌మెన్‌గా పనిలో చేరారు. అక్కడే నిర్మాణంలో ఉన్న భవనం దగ్గరే ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం పనికి వచ్చిన భవన నిర్మాణ సిబ్బంది.. వాచ్‌మెన్ దంపతులను దారుణంగా హత్య చేసినట్లుగా గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు.. ఘటనాస్థలిని క్షుణ్ణంగా పరిశీలించారు. క్లూస్ టీమ్ సహాయంతో దర్యాప్తు చేపట్టారు.



